సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
సోమవారం । 4 । డిసెంబర్ । 2023



రూ.1,01,116 విరాళం


అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి మల్లిపూడి అంజిబాబు, బాలదుర్గా భారతి దంపతులు (పశ్చిమ గోదావరి జిల్లా తణుకు) ఆదివారం రూ.1,01,116 విరాళం సమర్పించారు.



అన్నదాన భవనానికి రూ.లక్ష

ఆత్రేయపురం: వాడపల్లి క్షేత్రంలో వకుళ మాత అన్నదాన భవన నిర్మాణానికి నంద్రా సత్తిరెడ్డి, మంగాయమ్మ దంపతులు (రావుల పాలెం) రూ.లక్ష విరాళం సమర్పించారు.

డెల్టాలకు 3,600 క్యూసెక్కులు



ధవళేశ్వరం: డెల్టా కాలువలకు ఆదివారం 3,600 క్యూసెక్కుల గోదావరి నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 1,000, మధ్య డెల్టాకు 600, పశ్చిమ డెల్టాకు 2,000 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటి మట్టం 9.60 అడుగులుగా నమోదైంది.

న్యూస్‌రీల్

ప్రశాంతంగా ఎన్‌ఎంఎంఎస్ అర్హత పరీక్ష



పరీక్షా కేంద్రంలో పరిశీలిస్తున్న డీఈవో కమలకుమారి

రాయవరం: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్ అర్హత పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. రామచంద్రపురం, కొత్తపేట, అమలాపురం రెవెన్యూ డివిజన్ కేంద్రాల్లో పరీక్షను నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా 15 పరీక్షా కేంద్రాల్లో 3,121 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా, 3,051 మంది రాశారు. 70 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష నిర్వహించారు. పరీక్షలకు ముందు కేంద్రాల వద్ద విద్యార్థులకు సీఎస్, డీవోలు పరీక్ష రాసే విధానంపై అవగాహన కల్పిస్తూ సూచనలు చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులకు అవసరమైన వసతులు ఏర్పాటు చేశారు. జిల్లా విద్యాశాఖాధికారి ఎం.కమలకుమారి, ప్రభుత్వ పరీక్షల విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ నక్కా సురేష్, సీనియర్ ఎంఈవో బొజ్జా రమణశ్రీ పరీక్షలను పర్యవేక్షించారు. జిల్లావ్యాప్తంగా 15 పరీక్షా కేంద్రాల్లో సీఎస్, డీవోలతో పాటుగా, 130 మంది ఇన్విజిలేటర్లు విధులు నిర్వర్తించగా, రూట్ ఆఫీసర్లుగా బి.హనుమంతరావు, బీవీవీ సుబ్రహ్మణ్యం, పి.రాంబాబు వ్యవహరించారు. ఎక్కడా లోటుపాట్లు లేకుండా పరీక్షలు ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా నిర్వహించినట్లు డీఈవో కమలకుమారి తెలిపారు. ఎక్కడా మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదన్నారు.

అంతర్వేది ఆలయానికి పోటెత్తిన భక్తులు



దర్శనానికి క్యూ మార్గంలో వేచి ఉన్న భక్తులు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని సన్నిధికి ఆదివారం భక్తులు అత్యధిక సంఖ్యలో తరలివచ్చారు. కార్తిక మాసంలో ఆదివారం సెలవు రోజు కావడంతో స్వామి దర్శనానికి పిల్లాపాపలతో వచ్చారు. సాధారణ భక్తులతో పాటు అయ్యప్ప, భవానీ దీక్ష భక్తులు కూడా తరలి వచ్చారు. ఆలయంలో నిర్వహించే సుదర్శన హోమంలో భక్తులు పాల్గొన్నారు. స్వామివారి సన్నిధికి సుమారు పది వేల మంది భక్తులు వచ్చినట్టు అంచనా వేశామని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు. క్యూ ల్లో భక్తులకు ఏ విధమైన అసౌకర్యం లేకుండా ఉండేందుకు తగిన చర్యలు చేపట్టారు. దేవస్థానం నిత్యాన్నదాన పథకంలో భక్తులు భోజనం చేశారు.

తీరం అప్రమత్తం

- మిచాంగ్ తుపానును ఎదుర్కొనేందుకు సన్నాహాలు
- ప్రాణ, ఆస్తినష్టం జరగకుండా చర్యలు
- పునరావాస కేంద్రాల్లో వసతులు
- కలెక్టర్ హిమాన్షు శుక్లా



ఎస్.రామేశ్వరం తీర ప్రాంతంలోని నక్కపల్లి మండలానికి చెందిన మత్స్యకారులతో మాట్లాడుతున్న తహసీల్దార్ సాంబశివప్రసాద్



ధాన్యం రాశులపై టార్పాలిన్లు వేసుకోవాలని రైతులకు సూచనలు ఇస్తున్న జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు

అల్లవరం: బంగాళాఖాతంలో తరుముకొస్తున్న మిచాంగ్ తుపానును ఎదుర్కొనేందుకు జిలా యంత్రాగం సిద్ధమైంది. కోనసీమ జిల్లాలో తుపాను ప్రభావం వల్ల పలు ప్రాంతాల్లో ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురుస్తోంది. రాత్రి 8.30 గంటల నుంచి ప్రారంభమైంది. జిల్లా వ్యాప్తంగా 37 పునరావాస కేంద్రాలను ఏర్పాటుచేసి తాగునీరు, నిత్యవసరాలు, జనరేటర్ వంటి సౌకర్యాలు కల్పించారు. తుపాను పరిస్థితులను ఎదుర్కొనేందుకు రెవెన్యూ, ఫైర్, విద్యుత్, పంచాయతీరాజ్ శాఖలు అప్రమత్తమయ్యాయి. తీర ప్రాంతాల్లోని మత్స్యకారులకు తుపాను పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం కల్పిస్తున్నారు. భారీ గాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికారులు తీర ప్రాంతాల్లోనే బస ఏర్పాటు చేసుకుని తుపానుపై ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. భారీ గాలుల వల్ల విద్యుత్ స్తంభాలకు నష్టం వాటిల్లితే యుద్ధ ప్రతిపాదికన విద్యుత్‌ను పునరుద్ధరించేందుకు అధికారులు సిద్ధమయ్యారు. చెట్లు కూలి రాకపోకలకు ఇబ్బంది ఏర్పడితే పరిస్థితిని చక్కదిద్దేందుకు ఫైర్ సిబ్బంది తగిన ఏర్పాట్లు చేసుకుంటున్నారు. తుపాను తీవ్రత ఎక్కువగా ఉన్నందున సముద్రంలోకి వేటకు వెళ్లరాదని రెవెన్యూ, మత్స్యశాఖ అధికారులు మత్స్యకారులను ఇప్పటికే అప్రమత్తం చేశారు.

తీర ప్రాంతాల్లో నేడు పాఠశాలలకు సెలవు

మిచాంగ్ తుపాను పట్ల తీర ప్రాంతాల్లోని అధికారులు అప్రమత్తంగా ఉండి, ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదివారం తెలిపారు. ప్రస్తుతం బంగాళాఖాతంలో ఏర్పడిన తుపాను దక్షిణ కోస్తా ఉత్తర తమిళనాడు మధ్య తూర్పు తీరం వైపు పయనించే అవకాశం ఉందన్నారు. తుపాను ప్రభావం కోస్తా తీర ప్రాంతాలపై ఉండనున్న దృష్ట్యా తీర ప్రాంతంలోని అంబాజీపేట, అల్లవరం, ఉప్పలగుప్తం, మలికిపురం, సఖినేటిపల్లి, రాజోలు, పి.గన్నవరం, ముమ్మిడివరం, కాట్రేనికోన, ఐ.పోలవరం మండలాల్లోని పాఠశాలలకు సోమవారం సెలవు ప్రకటించారు. విపత్తు సమయాల్లో శిథిలావస్థల్లో ఉన్న భవనాల్లో తరగతులు నిర్వహించరాదని, జిల్లా విద్యాశాఖాధికారులు జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. పాఠశాలల్లో కంప్యూటర్లు, మధ్యాహ్న భోజన సరకులు సురక్షిత ప్రాంతాలకు తరలించుకోవాలని సూచించారు. ప్రాణ, ఆస్తి నష్టం సంభవిస్తే తక్షణమే అధికారులకు సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. తాగునీరు నిల్వ చేసే ఓహెచ్ ఆర్ ట్యాంక్‌లను బ్లీచింగ్‌తో శుభ్రపరచి, పాఠశాలల్లో చెత్త చెదారం, పడిపోయిన చెట్లు తొలగించాలని సూచించారు. విద్యార్థుల భద్రత కోసం చర్యలు తీసుకోవాలని విద్యాశాఖను కలెక్టర్ ఆదేశించారు.

తీరంలో వన భోజనాలపై నిషేధం

అమలాపురం రూరల్: తుపాను నేపథ్యంలో సముద్రం అల్లకల్లోలంగా ఉంటుందని, కార్తిక వన సమారాధన కార్యక్రమాలకు సముద్ర తీరం వెంబడి అనుమతులు ఇవ్వరాదని కలెక్టర్ హిమాన్షు శుక్లా పోలీసు, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఆదివారం ఆయన స్థానిక క్యాంపు కార్యాలయం నుంచి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పోలీసులు, ఆర్డీవోలు తహసీల్దారులు, ఎంపీడీవోలు, పంచాయతీరాజ్, ఆర్ అండ్ బీ ఇంజినీర్లు, జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ సాధికారత అధికారులు, వైద్య సిబ్బంది, ధాన్యం సేకరణ కస్టోడియన్ అధికారులతో తుపాను హెచ్చరికల నేపథ్యంలో తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సముద్రం వెంబడి అలలు పైకి ఎగసిపడే అవకాశం ఉన్నందున ఎటువంటి కార్తిక వన సమారాధన కార్యక్రమాలకు అనుమతిని ఇవ్వరాదని స్పష్టం చేశారు. వరి నూర్పిళ్లు చేసిన ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలలో భద్రపరచాలని సూచించారు. ధాన్యం సేకరణకు సంబంధించి జీపీఎస్ సిస్టం అప్డేట్ కాకపోయినప్పటికీ మాన్యువల్ విధానంలో సురక్షిత ప్రాంతాలలో భద్రపరుచుకునే విధంగా కస్టోడియన్ సిబ్బంది పూర్తిగా రైతులకు సహకరించాలని ఆదేశించారు. తీరం వెంబడి మత్స్యకారులు పడవలు నడపరాదని ఆయన స్పష్టం చేశారు. సహాయ పునరావాస కార్యక్రమాలపై సమీక్షించి అవసరమైన పునరావాస కేంద్రాలు అందుబాటులో ఉన్నది లేనిదీ ఆరా తీశారు. ప్రతి మండలంలో పడిపోయిన చెట్లు, ఎలక్ట్రికల్ స్తంభాలు తొలగించేందుకు జేసీబీ, పవర్ రంపాలు రోడ్ల క్లియరెన్స్ కోసం ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఏపీ ట్రాన్స్ కో అధికారులు విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు ముందుగా సమీకరించుకుని విద్యుత్ శక్తి పునరుద్ధరణకు సమాయత్తం కావాలన్నారు. జిల్లా స్త్రీ శిశు సంక్షేమ సిబ్బంది ద్వారా ప్రసవ తేదీలు వారం లోపు ఉన్న గర్భిణులను గుర్తించి ముందుగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లకు తరలించాలన్నారు. అదేవిధంగా ఆరోగ్య కేంద్రాలలో జనరేటర్లు డీజిల్‌తో సహా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జిల్లా ఎస్పీ ఎస్ శ్రీధర్, డీఆర్‌ఓ సీహెచ్ సత్తిబాబు, ఆర్డీవోలు, జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.కమలకుమారి, రహదారులు భవనాలశాఖ ఎస్ఈలు బి.రాము, సీహెచ్ఎన్వీ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

పునరావాస కేంద్రాలకు 40 మంది మత్స్యకారుల తరలింపు

అల్లవరం మండలం కొమరగిరిపట్నం శివారు ఎన్.రామేశ్వరం తీర ప్రాంతంలో నక్కపల్లి మండలం నుంచి చేపల వేటకు వచ్చి తీరంలో తాత్కాలిక నివాసాల్లో ఉంటున్న 40 మంది మత్స్యకారులను తుపాను పునరావాస కేంద్రానికి తరలించారు. వరి కోతలు అయిన ప్రాంతాల్లో ధాన్యం రాశులపై టార్పాలిన్స్ పరుచుకోవాలని జిల్లా వ్యవసాధియాకారి వి.బోసుబాబు, ఏడీ ఎం షంషీ అల్లవరం మండలం కోడూరుపాడులో ఆదివారం పర్యటించి రైతులను అప్రమత్తం చేశారు. తుపాను తగ్గేంత వరకు వరి కోతలు వాయిదా వేసుకోవాలని సూచించారు. అమలాపురం రూరల్ రెడ్డిపల్లిలో తుపాను పట్ల అప్రమత్తంగా ఉండాలని ధాన్యం రాశులపై టార్పాలిన్లు కప్పుకోవాలని ఆర్డీఓ కేశవ వర్ధన్ రెడ్డి సూచించారు.

కిక్కిరిసిన విఘ్నేశ్వరుని ఆలయం



అయినవిల్లి విఘ్నేశ్వరుని సన్నిధికి పోటెత్తిన భక్తులు

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరుని ఆలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. ప్రధానార్చకులు అయినవిల్లి సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో స్వామికి మేలుకొల్పు సేవ నిర్వహించారు. అనంతరం స్వామికి విశేష పూజలు నిర్వహించారు. స్వామిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి లఘున్యాస అభిషేకాల్లోను, లక్ష్మీగణపతి హోమంలోను భక్త దంపతులు పాల్గొన్నారు. స్వామివారికి గరిక పూజ జరిపారు. పంచామృత అభిషేకం, ప్రత్యేక అభిషేకాల్లో 178 మంది భక్త దంపతులు, స్వామివారి ప్రత్యేక దర్శనంలో 1,095 మంది భక్తులు, శ్రీ లక్ష్మీ గణపతి హోమంలో 45 మంది పాల్గొన్నారు. 20 మంది తమ నూతన వాహన పూజ నిర్వహించారు. 11 చిన్నారులకు నామకరణలు, అక్షరాభ్యాసాలు, నామకరణలు నిర్వహించారు. స్వామివారికి వివిధ పూజలు, అన్నదాన విరాళాల ద్వారా రూ. 2,92,655 లభించిందని ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.

నేడు యథావిధిగా జగనన్నకు చెబుదాం

అమలాపురం రూరల్: ప్రజాసమస్యల పరిష్కార వేదిక స్పందన (జగనన్నకు చెబుదాం) కార్యక్రమాలు సోమవారం యథావిధిగా జరుగుతాయని కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో జిల్లా స్థాయిలోను, ఆర్డీవో కార్యాలయంలో డివిజన్ స్థాయిలో, తహసీల్దార్ల కార్యాలయాల్లో గ్రామ, వార్డు సచివాలయాలలో అర్జీదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తారని వివరించారు. అధికారులు సోమవారం ఉదయం 10 గంటల నుంచే ఫిర్యాదులను స్వీకరిస్తారని, గ్రామ, వార్డు సచివాలయాల్లో మాత్రం మధ్యాహ్నం మూడు నుంచి సాయంత్రం ఐదు గంటల మధ్య విజ్ఞాపనలు స్వీకరిస్తారని కలెక్టర్ తెలిపారు. దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

పలివెల మహా పుణ్యక్షేత్రం

బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు



ఆధ్యాత్మిక ప్రసంగం చేస్తున్న కోటేశ్వరరావు

కొత్తపేట: కోనసీమ ప్రాంతంలో ప్రసిద్ధి చెందిన పులివెల క్షేత్రంలోని ఉమా కొప్పేశ్వరస్వామిని దర్శిస్తే.. కాశీ క్షేత్రంలో విశ్వేశ్వరస్వామిని దర్శించినంత పుణ్యం అని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచన కర్త, బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు అన్నారు. పవిత్ర కార్తికమాసంలో వివిధ పుణ్యక్షేత్రాల సందర్శనలో భాగంగా చాగంటి కోటేశ్వరరావు కుటుంబ సమేతంగా శనివారం రాత్రి కొత్తపేట మండలం పలివెల ఉమా కొప్పేశ్వర క్షేత్రాన్ని సందర్శించారు. స్వామివారిని దర్శించుకుని, స్వామివారికి, అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా స్థానిక వేద పండితులు పిడపర్తి రవికుమార్‌శర్మ, మైలవరపు శ్రీనివాస్‌శర్మ, కలగ శ్రీనివాస్ అవధాని చాగంటి కుటుంబ సభ్యుల పేరున ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం భక్తుల కోరిక మేరకు చాగంటి కొద్దిసేపు ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. ముఖ్యంగా ఇది పార్వతీ పరమేశ్వరులు ఏకపీఠంపై కొలువుదీరిన మహాపుణ్యక్షేత్రమని అన్నారు. ఇటువంటి శైవ క్షేత్రం చాలా అరుదని అన్నారు. ఎంతో విశిష్టమైన చరిత్ర కలిగిన ఈ ఉమా కొప్పేశ్వరస్వామి క్షేత్రం పురాతనమైనదని అన్నారు. కైలాస నిలయుడైన పరమశివుడు అగస్త్య మహాముని కోసం ఈ క్షేత్రంలో పార్వతీ సమేతుడై ఏకపీఠంపై దర్శనమిచ్చి అగస్త్యేశ్వరస్వామి అయ్యాడని అన్నారు. అలాగే తన భక్తుని కోసం కొప్పు ధరించి కొప్పేశ్వరుడయ్యాడని వివరించారు. దేశ వ్యాప్తంగా పలు ప్రసిద్ధ పుణ్యక్షేత్రాల్లో ఈ పలివెల క్షేత్రం ఒకటన్నారు. కార్తికమాసంలో ఈ స్వామిని దర్శించుకోవడం మహద్భాగ్యమన్నారు. ప్రతీ ఒక్కరూ తమ దైనందిన జీవితంలో కొంత సమయం ఆధ్యాత్మిక కార్యక్రమాలకు కేటాయించాలన్నారు. సాటివారి పట్ల సేవా దృక్పథంతో మెలగాలని సూచించారు. అత్యధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ముందుగా చాగంటిని అర్చకులు, గ్రామస్తులు స్వాగతం పలికి ఆలయంలోకి తోడ్కొని వెళ్లారు. పూజాధికాల అనంతరం ఆయనను సత్కరించారు.

మండపేటలో అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాలు

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- 6న భూమిపూజ.. జనవరి 26న విగ్రహాల ఆవిష్కరణ



కొత్తపేటలో విగ్రహాలు పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ త్రిమూర్తులు

కొత్తపేట: మండపేట పట్టణంలోని ప్రధాన సెంటర్‌లో భారత రాజ్యాంగ శిల్పి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, , భారత మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలను నెలకొల్పనున్నట్టు ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు తెలిపారు. ఎమ్మెల్సీ తోట ఆధ్వర్యంలో దళిత నాయకుల కమిటీ ఇచ్చిన ఆర్డర్ మేరకు కొత్తపేటలో ప్రముఖ శిల్పి డి.రాజ్‌కుమార్ వుడయార్ అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాలను రూపొందించారు. ఎమ్మెల్సీ త్రిమూర్తులు, మండపేట నియోజకవర్గ దళిత నాయకులు ఆదివారం వుడయార్ శిల్పశాలకు వచ్చి ఆ విగ్రహాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ త్రిమూర్తులు విలేకరులతో మాట్లాడుతూ ప్రపంచంలోనే ఏ దేశానికీ లేని గొప్ప రాజ్యాంగాన్ని భారతదేశానికి అందించిన వ్యక్తి అంబేడ్కర్ అని, ఎన్నో సంఘ సంస్కరణలు తీసుకువచ్చి 40 ఏళ్ల పాటు పార్లమెంటేరియన్‌గా, ఉప ప్రధానిగా దేశానికి సేవలందించిన వ్యక్తి బాబూ జగ్జీవన్‌రామ్ అని అన్నారు. వారిద్దరూ ఈ దేశంలో అట్టడుగు వర్గాలకు సూర్యచంద్రులని అన్నారు. అటువంటి మహనీయుల విగ్రహాలను మండపేటలో దళితవాడలకే పరిమితం చేశారని, అనేకసార్లు ఈ దళిత నాయకులు వారి చుట్టూ తిరిగినా మెయిన్‌రోడ్డులోకి తీసుకురావటానికి అక్కడి నాయకులు సహకరించలేదన్నారు. అంబేడ్కర్ విషయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అద్భుతమైన నిర్ణయాలు తీసుకుంటున్నారన్నారు. దానిలో భాగంగా ఈ దేశంలోనే ఎక్కడా లేని విధంగా విజయవాడ నడిబొడ్డున 22 ఎకరాలు సువిశాల విస్తీర్ణంలో 125 అడుగుల అంబేడ్కర్ కాంస్య విగ్రహంతో రూ.400 కోట్ల ప్రాజెక్టును త్వరలో ప్రారంభించనున్నారని తెలిపారు. మండపేట కరాచీ బేకరీ దగ్గరలో ఈ విగ్రహాలు నెలకొల్పుతామన్నారు. అందుకు ఈ నెల 6న అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా భూమిపూజ చేసి, జనవరి 26 న విగ్రహాలు ఆవిష్కరించనున్నట్టు త్రిమూర్తులు తెలిపారు. తోట వెంట కొత్తపేట మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు ముత్యాల వీరభద్రరావు, మాజీ ఉప సర్పంచ్ సలాది రామకృష్ణ, విగ్రహాల ఏర్పాటు కమిటీ కన్వీనర్, ఏడిద సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం, మండపేట ఏఎంసీ డైరెక్టర్ పలివెల సుధాకర్, రాయవరం సర్పంచ్ చంద్రమళ్ల రామకృష్ణ, మండపేట టౌన్ పార్టీ అధ్యక్షుడు ముమ్మిడివరపు బాపిరాజు, కౌన్సిలర్ మందపల్లి రవికుమార్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు తుపాకుల ప్రసన్నకుమార్ ఉన్నారు.

బ్రెయిన్.. స్ట్రెయిన్

మల్లవరం గ్రామానికి చెందిన రామారావు భార్య వరలక్ష్మి ఒక్కసారిగా అస్వస్థతకు గురైంది. శరీరం ఒక్కసారిగా బిగుసుకుపోయింది. మాట తడబడుతోంది. ఆందోళనకు గురైన రామారావు వెంటనే తన భార్యను రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ బోధనాస్పత్రికి తీసుకువచ్చారు. ఆమెలో పక్షవాతం లక్షణాలున్నాయని గుర్తించిన వైద్యులు.. వెంటనే ఐసీయూకు తరలించి, చికిత్స ప్రారంభించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం కుదుట పడింది. తన భార్య ప్రాణాలతో బయట పడుతుందనుకోలేదని, నయా పైసా ఖర్చు లేకుండా ఆమెను దక్కించుకోగలిగామని రామారావు అన్నారు. కేవలం వరలక్ష్మి ఒక్కరే కాదు.. పక్షవాతంతో బాధ పడుతున్న వందలాది మందికి ఈ ఆస్పత్రిలో పూర్తి ఉచితంగా వైద్యం అందుతోంది.

- గతంలో వయసు పైబడిన వారికే పక్షవాతం
- ప్రస్తుతం పాతికేళ్ల యువకులకూ సమస్య
- రాజమహేంద్రవరం బోధనాస్పత్రిలో 854 పైగా కేసులు
- ఉచిత చికిత్స అందిస్తున్న వైద్యులు



పక్షవాత రోగికి సేవలందిస్తున్న వైద్యులు

సాక్షి, రాజమహేంద్రవరం: ఉన్నట్టుండి శరీరం బిగుసుకుపోవడం.. మూతి వంకర తిరగడం.. కాళ్లు, చేతులు చచ్చుబడిపోవడం.. ఒక్కోసారి గుండె కూడా పని చేయకపోవడం.. ఇలా శరీరంలో ప్రతి అవయ వంపై ప్రభావం చూపుతున్న వ్యాధి పక్షవాతం. అప్ప టి వరకూ ఆనందంగా సాగిపోతున్న వారి జీవితాల ను అకస్మాత్తుగా కుప్ప కూల్చేస్తోంది. వారి బతుకుల ను ఉన్నట్టుండి అంధకారంలోకి నెట్టేస్తోంది. ఈ వ్యా ధికి గురైన వారిలో కొందరు వికలాంగులై కష్టాల నడు మ బతుకుబండి లాగుతూంటే.. మరికొందరు ఏకంగా ప్రాణాలే కోల్పోతున్నారు. మారిన ఆహారపు అలవాట్లు, రక్తపోటు, మధుమేహాన్ని నియంత్రించుకోవడంలో నిర్లక్ష్యం, వ్యాధి లక్షణాలను ముందుగా గుర్తించకపోవడం, సరైన సమయంలో తగిన వైద్యం పొందకపోవడంతో ఎక్కువ శాతం మంది పక్షవాతం ము ప్పునకు గురవుతున్నారని వైద్యులు చెబుతున్నారు.

ముందస్తు సంకేతాలు

పక్షవాతాన్ని ఆంగ్లంలో పెరాలసిస్, వైద్య పరిభాషలో బ్రెయిన్ స్ట్రోక్ అని పిలుస్తారు. మెదడుకు రక్త సరఫరాలో ఆటంకం ఏర్పడినపుడు కొన్ని లక్షణాలు బయటపడతాయి. ఈ లక్షణాలన్నింటినీ కలిపి బ్రెయిన్ స్ట్రోక్ అంటారు. ఈ స్ట్రోక్ వచ్చిన వారిలో మెదడుకు రక్తం సరఫరా తగ్గడంతో శరీరంలో తిమ్మిర్లు, ఒక కాలు, చేతిలో శక్తి తక్కువైనట్లు అనిపిస్తుంది. పూర్తిగా లేదా సరిగ్గా మాట్లాడలేకపోతారు. ఇతరులు చెప్పింది అర్థం చేసుకోలేరు. చూపు మసకబారుతుంది. నడవాలని లేచినప్పుడు బ్యాలెన్స్ తప్పినట్లవుతుంది. తీవ్రమైన తలనొప్పి మొదలవుతుంది. ఈ లక్షణాలు కనిపించిన మూడు గంటల్లోపు స్ట్రోక్ యూనిట్ సౌకర్యం ఉన్న ఆస్పత్రికి తీసుకువెళ్తే రక్త ప్రసరణను పునరుద్ధరించి, మెదడు ఎక్కువగా దెబ్బ తినకుండా వైద్యులు కాపాడతారు.

అవగాహన లోపం.. సమస్య తీవ్రం

దేశంలో సగటున 10 శాతం మంది ఈ వ్యాధి బారిన పడుతున్నట్లు వివిధ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ప్రజల్లో కేవలం 10 శాతం మందికే పక్షవాతంపై అవగాహన ఉంది. అవగాహన లోపంతోనే చాలా మంది దీని బారిన పడుతున్నారని వైద్యులు చెబుతున్నారు. బ్రెయిన్ స్ట్రోక్‌కు గురైన వారిలో 30 శాతం మంది శాశ్వత వైకల్యానికి గురవుతున్నారు. పక్షవాతం గతంలో వృద్ధుల్లోనే కనిపించేది. ప్రస్తుతం దీని బారిన పడుతున్న వారిలో 25 నుంచి 30 శాతం వరకూ పాతికేళ్లకు కాస్త అటూ ఇటుగా ఉన్న వారుంటున్నారు. 45 ఏళ్లు పైబడిన వారిలో రిస్క్ ఎక్కువగా ఉంటోంది. 55 ఏళ్లు పైబడిన స్త్రీలలో రిస్క్ మరింత ఎక్కువ. అధిక రక్తపోటు, షుగర్, అధిక కొలెస్ట్రాల్, గుండె జబ్బులు, ఊబకాయం ఉన్న వారికి పక్షవాతం వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని వైద్యులు చెబుతున్నారు. దీనికి ధూమపానం, మద్యపానం, మారిన ఆహార అలవాట్లు, జీవన శైలి కూడా ఈ సమస్యకు కారణమవుతున్నాయి.

బోధనాస్పత్రిలో మెరుగైన వైద్యం

ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో పక్షవాతానికి గురవుతున్న రోగులకు రాజమహేంద్రవరం బోధనాస్పత్రిలో పూర్తి ఉచితంగా వైద్యం అందిస్తున్నారు. ఇక్కడ ప్రతి రోజూ అన్ని విభాగాలకు సంబంధించి 800 మందికి పైగా ఓపీ వైద్య సేవలు అందిస్తున్నారు. వీరిలో గడచిన ఏడు నెలల్లో 854 కేసులు పెరాలసిస్‌వే ఉన్నాయి. దీనినిబట్టి పక్షవాత బాధితులు ఏ స్థాయిలో ఉంటున్నారో అర్థం చేసుకోవచ్చు. వీరిలో కొందరు అప్పటికప్పుడే వైద్యం చేయించుకుని ఇళ్లకు వెళుతుండగా.. మరికొందరు ఆస్పత్రిలో చేరుతున్నారు. కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, ఏలూరు, అల్లూరి సీతారామరాజు, తూర్పు గోదావరి జిల్లాలకు చెందిన పక్షవాత బాధితులు ఎక్కువ మంది ఇక్కడికే వస్తున్నారు. విషమ పరిస్థితుల్లో వస్తున్న వారిని సైతం అక్కున చేర్చుకుని వ్యాధి నయమయ్యే వరకూ తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ప్రైవేటు ఆస్పత్రుల్లో రూ.వేలు వెచ్చిస్తేనే కానీ అందని వైద్యాన్ని ఇక్కడ నయా పైసా ఖర్చు లేకుండా అందిస్తున్నారు. ప్రధానంగా ఎంతో ఖర్చుతో కూడుకున్న ఐసీయూ సేవలు సైతం ఉచితంగా అందించడంపై రోగుల కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. బాధితులు రోజుల వ్యవధిలోనే సంపూర్ణ ఆరోగ్యవంతులై ఇళ్లకు సంతోషంగా తిరిగి వెళుతున్నారు.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి

- తరచూ బీపీ, షుగర్ పరీక్షించుకోవాలి. వాటిని నియంత్రణలో ఉంచుకోవాలి.
- ఎక్కువ నీరసంగా ఉంటే ఆస్పత్రిలో చేరాలి.
- గుండె, కిడ్నీ సమస్యలున్న వారు వైద్య పరీక్షలు చేయించుకుని తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.
- ఒత్తిడికి దూరంగా ఉండాలి.
- ఆహారపు అలవాట్లు బాగుండాలి.
- ప్రతి రోజూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి.

ఏడు నెలల్లో రాజమహేంద్రవరం బోధనాస్పత్రిలో నమోదైన పక్షవాతం కేసులు

నెల	కేసులు
జూన్	127
జూలై	120
ఆగస్టు	117
సెప్టెంబర్	113
అక్టోబర్	124
నవంబర్	120
డిసెంబర్	133

మెరుగైన వైద్యం



పెరాలసిస్ రోగులకు మెరుగైన వైద్యం అందిస్తున్నాం. క్రిటికల్ కేసులను చాలెంజింగ్‌గా తీసుకుని మరీ నయం చేసి పంపుతున్నాం. అందుకు అవసరమైన అన్ని వసతులూ ఆస్పత్రిలో కల్పించాం. ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి కేసులు వస్తున్నాయి. మధుమేహం, రక్తపోటు, ఆహార అలవాట్ల కారణంగా 30 ఏళ్ల లోపు వారు సైతం వ్యాధి బారిన పడుతున్నారు. వాటిని నియంత్రించుకుంటే పక్షవాత నివారణ సాధ్యమవుతుంది.

– డాక్టర్ పీవీవీ సత్యనారాయణ, విభాగాధిపతి, జనరల్ మెడిసిన్, ప్రభుత్వ బోధనాస్పత్రి, రాజమహేంద్రవరం

ఆహార అలవాట్లు మార్చుకోవాలి



మద్యం, సిగరెట్లు తాగే వాళ్లలో 80 శాతం మంది పెరాలసిస్ బారిన పడుతున్నారు. ప్రధానంగా ప్రస్తుతం మారిన ఆహార అలవాట్ల కారణంగా ఊబకాయం సమస్యతో వ్యాధి బారిన పడుతున్నారు. ప్రధానంగా మధుమేహం, రక్తపోటును నియంత్రణలో ఉంచుకోవాలి. వ్యాధి లక్షణాలు వచ్చిన నాలుగు గంటల్లో ఆస్పత్రిని ఆశ్రయించాలి.

– డాక్టర్ పరిమి నాగ సత్య ప్రసాద్, డీఎం, న్యూరాలజీ

క్లుప్తంగా

పీచు ఫ్యాక్టరీ దగ్ధం



ఆలమూరు-జొన్నాడలో రోడ్డులో దగ్ధమవుతున్న పీచు ఫ్యాక్టరీ

ఆలమూరు: ఆలమూరు-జొన్నాడ రోడ్డులో ఆదివారం జరిగిన అగ్ని ప్రమాదంలో శ్రీషణ్ముఖ క్వాయర్ ఇండస్ట్రీస్ (పీచు ఫ్యాక్టరీ) పూర్తిగా దగ్ధమైంది. దీంతో ఫ్యాక్టరీలోని ముడిసరకు, పీచుతో పాటు యంత్రాలు సహా కాలి బూడిదయ్యాయి. మండపేట నుంచి అగ్నిమాపక వాహనం వచ్చి మంటలు వ్యాప్తి చెందకుండా అదుపు చేసే ప్రయత్నం చేసింది. మూడు యంత్రాలు, నాలుగు కన్వేయర్ బెల్ట్‌లు, సుమారు 30 టన్నుల పీచు, 23 టన్నుల కొబ్బరి పొట్టు దగ్ధమైనట్లు యజమాని గన్ని కుసుమ తెలిపారు. ఆస్తినష్టం సుమారు రూ.ఎనిమిది లక్షల వరకూ ఉండవచ్చునన్నారు. షార్ట్ సర్క్యూట్ వల్లే ఈ ప్రమాదం సంభవించి ఉండవచ్చునని భావిస్తున్నారు.

వరి చేలు ఆహుతి

నష్టం రూ.10 లక్షలు



గోపాలపురం మండలం చిట్యాల సమీపంలో దగ్ధమవుతున్న వరి చేలు

గోపాలపురం: మండలంలోని చిట్యాల అన్నదేవరపేట గ్రామాల మధ్య కోతకు వచ్చిన వరి చేలు ప్రమాదవశాత్తూ దగ్ధమయ్యాయి. ఆదివారం మధ్యాహ్నం వీచిన ఈదురు గాలులకు చిట్యాల, అన్నదేవరపేట గ్రామాలకు చెందిన సుమారు 20 ఎకరాలలోని వరి చేలు అగ్నికి ఆహుతి అయ్యాయి. సమీప రైతులు మంటలను అదుపు చేయడంతో మిగిలిన పంటకు మంటలు వ్యాప్తి చెందకుండా ఆపగలిగారు. కొవ్వూరు అగ్నిమాపక కేంద్రం వాహనం వచ్చినా.. వరి చేల వద్దకు వెళ్లే అవకాశం లేకపోయింది. ప్రమాదానికి కారణం తెలియరాలేదు. రూ.10 లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు రైతులు వేగి వెంకటేశ్వరరావు, కాట్రగడ్డ శ్రీను, మార్గాని సూర్యారావు తెలిపారు.

నేడు సత్యదీక్ష విరమణ



సత్యదీక్ష పడిపూజ నిర్వహిస్తున్న పండితులు



పడిపూజలో పాల్గొన్న స్వాములు

- సామూహిక వ్రతాలు ఆచరించిన గిరిజన సత్య స్వాములు
- రత్నగిరిపై ఘనంగా పడిపూజ

అన్నవరం : శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో సత్యదీక్షలు ఆచరించిన సత్యస్వాములు కార్తిక సోమవారం పర్వదినం సందర్భంగా దీక్ష విరమణ చేయనుండడంతో దేవస్థానం అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. గత నెల ఏడో తేదీన సత్యదేవుని జన్మనక్షత్రం మఖ సందర్భంగా వేలాది మంది సత్యదీక్షలు స్వీకరించిన విషయం విదితమే. వారంతా 27 రోజుల దీక్ష అనంతరం సత్యదేవుని నామం జపిస్తూ సోమ వారం స్వామివారి సన్నిధిలో దీక్ష విరమించనున్నారు. కార్తిక సోమవారం సందర్భంగా అధికంగా భక్తులు సత్యదేవుని సన్నిధికి వచ్చే అవకాశం ఉండడంతో సత్యదీక్ష విరమణకు సంబంధించి దేవస్థానం అధికారులు పలు నిర్ణయాలు తీసుకున్నారు.

దీక్ష స్వీకరించిన మూడు వేల మంది సత్యస్వాములు

గత నెల ఏడో తేదీన సత్యదీక్ష స్వీకరించి 27 రోజులు దీక్ష చేసిన స్వాములతో బాటు 18 రోజులు, తొమ్మిది రోజుల దీక్షలు కూడా పెద్ద సంఖ్యలో భక్తులు చేశారు. ఈ విధంగా సుమారు మూడు వేల మంది భక్తులు దీక్ష లు స్వీకరించినట్లు అధికారులు తెలిపారు. వీరిలో సుమారు 250 మంది దేవస్థానం సిబ్బంది ఉన్నారు.

కనకదుర్గ ఆలయంలో ఇరుముడులు, నిత్య కల్యాణ మంటపంలో స్వీకరణ

- సోమవారం తెల్లవారుజామున ఒంటి గంటకు తొలిపాంచా వద్ద గల కనకదుర్గ అమ్మవారి ఆలయంలో సత్యస్వాములకు ఇరుముడులు కడతారు.
- ఇరుముడులు సత్యదేవుని నిత్య కల్యాణ మంటపంలో తెల్లవారుజామున ఒంటి గంట నుంచి స్వీకరిస్తారు.
- వనదుర్గ అమ్మవారి ఆలయంలో ఏర్పాటు చేసిన హోమగుండంలో ఇరుముడిలోని ద్రవ్యాలు, నేయి, కొబ్బరి కాయలను వేయాలని నిర్ణయించారు.

దీక్ష విరమణ అనంతరం సత్యదీక్ష స్వాములకు సత్యదేవుని దర్శనం, అన్నదాన పథకంలో భోజన సౌకర్యం కల్పిస్తున్నట్లు అధికారులు తెలిపారు. సోమవారం తెల్లవారుజామున ఒంటి గంటకు సత్యదేవుని ప్రధానాలయంలో స్వామివారికి జన్మ నక్షత్ర పూజల అనంతరం సత్యదేవుని నిత్యకల్యాణ మంటపంలో అర్చకస్వాములకు ఇరుముడులు సమర్పించి వారి చేతుల మీదుగా దీక్షా మాలలు విసర్జించి, దీక్ష విరమించేందుకు ఏర్పాట్లు చేశారు.

గిరిజన సత్యస్వాముల సామూహిక వ్రతాలు

దూర ప్రాంతాలకు చెందిన సత్యదీక్ష స్వాములు, ఏజెన్సీ ప్రాంతానికి చెందిన స్వాములు ఆదివారం మధ్యాహ్నం రత్నగిరిపై సత్యదేవుని సామూహిక వ్రతాలు ఆచరించారు. ఏటా సత్యదీక్షల విరమణ రోజునే ఈ వ్రతాలు ఆచరిస్తుంటారు. అయితే కార్తిక సోమవారం రత్నగిరిపై రద్దీ ఎక్కువగా ఉండే అవకాశం ఉండడంతో ముందుగానే సామూహిక వ్రతాలు నిర్వహించారు. సుమారు 300 మంది గిరిజన సత్యస్వాములు ఈ వ్రతాలు ఆచరించారు.

ఘనంగా పడిపూజ

సత్యదేవుని సన్నిధిలో వార్షిక కల్యాణ మంటపం వద్ద సాయంత్రం ఆరు నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు సత్యదేవుని పడిపూజ ఘనంగా నిర్వహించారు. దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ రామచంద్రమోహన్ జ్యోతి వెలిగించి ఈ పడిపూజ ప్రారంభించారు. వందలాది మంది సత్య స్వాములు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అమలాపురంలో సినీ తార 'రాశీ ఖన్నా' సందడి



ఎస్ఆర్ షాపింగ్ మాల్ ప్రారంభోత్సవంలో మంత్రి విశ్వరూప్, ఎంపీ అనురాధ, కలెక్టర్ శుక్లా, ఎమ్మెల్సీ ఇజ్రాయిల్, ఎమ్మెల్యే చిట్టిబాబు



ఎస్ఆర్ షాపింగ్ మాల్‌ను ప్రారంభించి పట్టు చీరలను పరిశీలిస్తున్న సినీ తార రాశీ ఖన్నా

అమలాపురం టౌన్: రాష్ట్రంలో 17 సంవత్సరాలుగా 11 బ్రాంచీల ద్వారా వస్త్ర ప్రభంజనం సృష్టిస్తున్న ఎస్ఆర్ షాపింగ్ మాల్ సంస్థ తన 12వ బ్రాంచిని అమలాపురం హైస్కూలు సెంటరులోని బహుళ అంతస్తుల భవనంలో ఆదివారం ఉదయం ప్రారంభించింది. సినీ హీరోయిన్ రాశీఖన్నా షాపింగ్ మాల్‌ను ప్రారంభించారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్, అమలాపురం ఎంపీ చింతా అనురాధ, కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు, అమలాపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (అముడా) చైర్మన్ గొల్లపల్లి డేవిడ్ ఈ కార్యక్రమానికి అతిథులుగా హాజరై జ్యోతి వెలిగించి షాపింగ్ మాల్‌లోని పలు విభాగాలను ప్రారంభించారు. సినీ తార రాశీ ఖన్నా షాపింగ్ మాల్‌లోని అన్ని వస్త్ర విభాగాలకు వెళ్లి పరిశీలించారు. పట్టు చీరల విభాగంలో ఫొటోలకు పోజులిచ్చారు. నటితోపాటు సింగర్ అయిన రాశీ ఖన్నా 'ఊహలు గుసగుసలాడే' చిత్రంలోని ఓ పాటను పాడి అలరింపచేశారు. అనంతరం షాపింగ్ మాల్ భవనం వెలుపల రోడ్డు చెంత ఏర్పాటు చేసిన వేదికపై రాశీ ఖన్నా అభిమానులకు అభివాదం చేసి మరో పాట పాడారు. ఎస్ఆర్ షాపింగ్ మాల్ డైరెక్టర్ గోపీనాథ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు వి.పూజారి, ఎ.శివ కేశవరెడ్డి, రమేష్, మార్కెటింగ్ హెడ్ రఘునాథ్, ఏరియా మేనేజర్ పఠాన్ ఫిరోస్ ఖాన్, బ్రాంచి మేనేజర్ శివారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో షాపింగ్ మాల్స్‌ను మా వినియోగదారులు నమ్మకం, విశ్వాసంతో విజయవతంగా నడుపుతున్నామని చెప్పారు.

షూటింగ్ బాల్ ఉమ్మడి జిల్లా జట్ల ఎంపిక



రాష్ట్ర పోటీలకు ఎంపికైన జిల్లా జట్లతో పీడీ, పీఈటీలు

కొత్తపేట: షూటింగ్ బాల్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జట్ల ఎంపిక ఆదివారం కొత్తపేట జెడ్పీ బాలికోన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహించారు. ఈ నెల 8, 9, 10 తేదీల్లో గుంటూరు జిల్లా మార్టూరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉమ్మడి జిల్లా తరఫున అండర్ -19 బాలుర, బాలికల జట్లు పాల్గొంటాయని సెక్రటరీ బి.సతీష్‌బాబు, ఎంఎస్‌డీఓ వైఎస్ఎస్ ఉషారాణి తెలిపారు. బాలికల జట్టుకు జి.శ్రీలక్ష్మీపావని, ఆర్.మేరీ, డి.జాహ్నవిశ్రీ, ఎస్.స్వాతి నిఖిల, ఎండీఎల్ ప్రసన్న, డి.హేమ, షేక్ రజియాబేగం, పి.శిరీష, ఎస్.జస్వంతి, కేఎంఎస్ శ్రీభవాని, ఎస్.రషిదా బేగం, డి.ప్రణతి ఎంపికయ్యారు. బాలుర టీమ్‌కు ఎన్‌వీవీ కృష్ణతేజ, డి.సత్యభాస్కర్, బీవైసందీప్, కె.వినయ్, బి.నాగేష్, కె.ఆనంద్, డి.అచ్యుత్, జీఎస్‌వీ రమేష్, వై.సాత్విక్, కె.సుశాంక్, కె.సుభాష్, జి.ప్రకాష్ ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో పీడీ, పీఈటీలు ఏఎస్ఎస్ రమాదేవి, ఐ.ప్రతాప్, బీఎస్ మల్లేశ్వరరావు, ప్రసాద్, కె.రవి, ఎస్.భాస్కరరావు పాల్గొన్నారు.

పట్టా పండగకు సన్నాహాలు

- జేఎన్‌టీయూకే 10వ స్నాతకోత్సవానికి నోటిఫికేషన్
- ఈ నెల 31వ తేదీ దరఖాస్తులకు తుది గడువు
- ఫిబ్రవరి లేదా మార్చిలో నిర్వహణకు సన్నాహాలు



జేఎన్‌టీయూకే

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జేఎన్‌టీయూకే 10వ స్నాతకోత్సవానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు విద్యార్థులు ఒరిజనల్ డిగ్రీకి ఈ నెల 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని వర్సిటీ వెబ్‌సైట్‌లో సూచించారు. దీంతో అతిరథ మహారథుల చేతుల మీదుగా సంప్రదాయ వస్త్రధారణలో పట్టా (ఒరిజనల్ డిగ్రీ) అందుకోవాలని కలలు కంటున్న విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది మే 31వ తేదీన నిర్వహించిన 9వ స్నాతకోత్సవానికి కులపతి హోదాలో గవర్నర్ అబ్దుల్ నజీర్ హాజరయ్యారు. బీటెక్ విభాగంలో 40వేల ఓడీలతో పాటు ఫార్మసీ, పీజీ విభాగంలో మరో 15వేల వరకూ ఓడీలు విద్యార్థులకు అందజేశారు. ఏటా క్రమం తప్పకుండా వర్సిటీ నిర్వహించాల్సిన ఈ వేడుకలు కోవిడ్ నేపథ్యంలో 2020, 2021 సంవత్సరాలలో నిర్వహించలేదు. వీసీగా బాధ్యతలు స్వీకరించిన జీవీఆర్ ప్రసాదరాజు 8వ స్నాతకోత్సవం గత ఏడాది మార్చి 9వ తేదీన నిర్వహించి రెండు సంవత్సరాలకు సంబంధించి 45వేల మందికి పైగా పట్టాలు జారీ చేశారు.

దరఖాస్తు చేసుకోవాలి



ఒరిజనల్ డిగ్రీ (పట్టా) కోసం బీటెక్, ఎంటెక్ పూర్తిచేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలి. వేడుకలు వచ్చే ఏడాది ఫిబ్రవరి లేదా మార్చి నెలలో గవర్నర్ అనుమతి మేరకూ నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నాం. క్రమం తప్పకుండా ఏటా స్నాతకోత్సం నిర్వహించాలనేది నా లక్ష్యం. వర్సిటీకి అనుబంధంగా ఉన్న కళాశాలల విద్యార్థులకు సంక్షేమమే లక్ష్యంగా వారికి ఏవిధమైన అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటున్నాం.

– డాక్టర్ జీవీఆర్ ప్రసాద్‌రాజు, వీసీ, జేఎన్‌టీయూకే

నాగవంశీయుల సంక్షేమమే లక్ష్యం



చైర్‌పర్సన్ అప్పలకొండమ్మ దంపతులను సన్మానిస్తున్న సంఘీయులు

ఏలేశ్వరం: నాగవంశీయుల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తున్నదని నాగవంశం రాష్ట్ర కార్పొరేషన్ చైర్‌పర్సన్ బొడ్డు అప్పలకొండమ్మ అన్నారు. మండలంలోని లింగంపర్తి గ్రామంలో ఆదివారం నాగవంశీయుల ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న అప్పలకొండమ్మ మాట్లాడుతూ నాగవంశీయులు ఆర్థిక, సామాజిక, విద్యారంగాల్లో అభివృద్ధి చెందేలా ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. ప్రభుత్వం అన్నివర్గాలకు సమన్యాయం చేస్తుందన్నారు. నాగవంశీయుల అభ్యున్నతికి తన వంతు కృషి చేస్తానన్నారు. అనంతరం చైర్‌పర్సన్ అప్పలకొండమ్మ, సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొడ్డు అప్పలనాయుడు దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం

జిల్లా అధ్యక్షుడిగా పీవీబీ సంజీవరావు, కార్యదర్శిగా కనకల సత్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా కాళ్ల త్రిమూర్తులు, కాళ్ల ప్రసాద్, కాళ్ల శ్రీను, ప్రధాన కార్యదర్శిగా బామి పాపారావు, సహాయ కార్యదర్శులుగా రామేన కేశవ, కంఠబోతు భాస్కర్, కోశాధికారి రాంబిల్లి పాపారావు, గౌరవ అధ్యక్షుడిగా గాడు రాఘవ, కాళ్లబాబు, కొంకిశ్రీను, బోను దేవుడును సభ్యులను ఎన్నుకున్నారు.

బీటెక్ విద్యార్థి అదృశ్యం



కర్రివాని రేవు గోదావరి పాయ వద్ద తచ్చాడుతున్న పోలీసు జాగిలం



కార్తీక వర్మ (ఫైల్)

ముమ్మిడివరం: మండలంలోని చినకొత్త లంకలో బీటెక్ విద్యార్థి అదృశ్యం తీవ్ర కలకలం రేపింది. పాత్తూరి కార్తీక వర్మ(22) ఓడలరేవు బీవీసీ కళాశాలలో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. శనివారం సాయంత్రం ఇద్దరు స్నేహితులతో కలిసి యానాం వెళ్లి అర్ధరాత్రి 2గంటల సమయంలో మర్లపాలెంలో స్నేహితుడి ఇంటికి చేరుకున్నాడు. మోటారు బైక్, కాళ్ల చెప్పులు అక్కడ వదలి ఆదృశ్యం అయ్యాడు. ఈ మేరకు కాకినాడలో ఉంటున్న తండ్రికి వచ్చిన మెసేజ్ ఆధారంగా కుటుంబ సభ్యులు ముమ్మిడివరం పోలీసులకు సమాచారం అందించారు. ముమ్మిడివరం సీఐ ఎస్.కొండయ్య, ఎస్సై ఎస్.శివప్రసాద్ కాకినాడ నుంచి డాగ్ స్క్వాడ్‌ను రప్పించి గాలింపు చర్యలు చేపట్టారు. స్పైడర్ అనే డాగ్ ముందుగా కార్తీక వర్మ చెప్పులను వాసన చూసి అక్కడ నుంచి కర్రివాని రేవు ప్రధాన పంట కాలువపై ఉన్న వంతెన దాటి కొబ్బరి తోటల మీదుగా వృద్ధ గౌతమీ గోదావరి పాయ వరకు వెళ్లి ఆగిపోయింది. పోలీసులు నాటు పడవలపై గోదావరిలో గాలింపు చర్యలు చేపట్టారు. కార్తీక వర్మ బీటెక్ చదుకుంటూ చిన కొత్తలంకలో అమ్మమ్మ గారి ఇంటి వద్ద ఉంటున్నాడు. సీఐ ఎస్.కొండయ్య పర్యవేక్షణలో ఎస్సై ఎస్.శివప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



ఘటనా స్థలిలో మృతదేహం

పెద్దాపురం: కారు, బైక్ ఢీకొన్న ఘటనలో యువకుడు అక్కడికక్కడే మృతి చెందిన ఘటన ఆదివారం పెద్దాపురం పట్టణంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం సామర్లకోటకు చెందిన బొడ్డు రాజు (20), రమణ సామర్లకోట వెళుతుండగా స్థానిక ఎల్ఐసీ కార్యాలయం వద్ద ఎదురుగా వస్తున్న కారును ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో రాజు అక్కడికక్కడే మృతిచెందగా రమణ తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికులు 108లో రమణను కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ సురేష్ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టానికి పెద్దాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మోటార్ సైకిల్ చక్రంలో చీర చిక్కుకుని మహిళ మృతి

గండేపల్లి: మోటార్ సైకిల్ చక్రంలో చీర చిక్కుకుని మహిళ మృతి చెందినట్టు గండేపల్లి ఎస్సై వై.గణేష్‌కుమార్ తెలిపారు. శనివారం రాత్రి తూర్పుగోదావరి జిల్లా చాగల్లు మండలం చాగల్లు గ్రామానికి చెందిన భార్యాభర్తలు బద్దిరెడ్డి వీర వెంకట సత్యనారాయణ, సత్యవతి(38) మోటార్ సైకిల్‌పై అన్నవరం బయలుదేరారు. మండలంలోని మల్లేపల్లి సంతమార్కెట్ దాటేసరికి సత్యవతి చీర కొంగు మోటార్ సైకిల్ వెనుక చక్రంలో చిక్కుకోవడంతో ఆమె రోడ్డుపై పడిపోయింది. ఈ ఘటనలో సత్యవతిని కొంత దూరం ఈడ్చుకుంటూ పోవడంతో ఆమె తలకు బలమైన గాయమయింది. 108 అంబులెన్స్‌లో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు తెలియజేశారు. మృతురాలు తండ్రి అల్లుబోను పాపారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు ప్రారంభించినట్టు ఎస్సై తెలిపారు.

ఎస్పీ చొరవతో.. నిలిచిన నాలుగు ప్రాణాలు

- ఆత్మహత్యకు ప్రయత్నించిన కుటుంబాన్ని కాపాడిన పోలీసులు
- యాప్ ద్వారా రూ.13 లక్షలు పెట్టుబడి పెట్టి మోసపోయిన వైనం
- లోన్‌యాప్ తరహాలో మార్ఫింగ్ ఫొటోలతో భయపెట్టిన అపరిచిత వ్యక్తులు



బాధితుడు రూ.13 లక్షలు డిపాజిట్ చేసిన సమయంలో ఇచ్చిన రశీదు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఎస్పీకి చేరిన చిన్న ఫోన్ కాల్ నలుగురి ప్రాణాలు నిలిపింది. తనకు వచ్చిన ఫోన్‌ను మానవత్వ కోణంలో చూసిన ఎస్పీ పి.జగదీష్ వేగంగా స్పందించి బాధితుడికి ధైర్యం చెప్పడంతో పాటు తన సిబ్బందిని అప్రమత్తం చేయడంతో నలుగురు బతికారు. వివరాల్లోకి వెళితే.. రాజమహేంద్రవరం ఆనందనగర్‌కు చెందిన ఓ యువకుడు ప్రభుత్వ శాఖలో చిరు ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. ఎటువంటి దురలవాట్లు లేవు. అతడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. తనకు స్థోమత లేకపోయినా పిల్లలను కార్పొరేట్ స్కూల్లో చదివించేందుకు తాపత్రయ పడ్డాడు. తన జీతం తక్కువ కావడంతో ఇతరత్రా ఆదాయ మార్గాల కోసం వెతుకుతుండగా ఓ వ్యక్తి పరిచయం అయ్యాడు. తనకు పరిచయస్తుడు పెట్టిన ఆన్‌లైన్ కంపెనీ ఉందని దాని యాప్ ద్వారా డబ్బులు డిపాజిట్ చేస్తే నెలకు నూటికి 16 రూపాయల వడ్డీ వస్తుందని చెప్పాడు. ప్రతీ వారం వడ్డీ జమ అవుతుందని ఆశ చూపించాడు. దీంతో పిల్లల పేర పొదుపు చేసిన రూ.4 లక్షలు ఆ కంపెనీలో పెట్టుబడి పెట్టాడు. తన వ్యక్తిగత వివరాలు నమోదు చేసి ఆ కంపెనీ యాప్ డౌన్‌లోడ్ చేసుకున్నాడు. అతడి ఖాతాకు వారం వారం ఠంచనుగా వడ్డీ వచ్చేది. పిల్లలకు అవసరాలు తీర్చేవాడు. ఇక నా జీవితం కష్టాలు తీరిపోయాయి. అని సంబర పడ్డాడు. వడ్డీ డబ్బులు వస్తుండటంతో బయట పరిచయస్తుల వద్ద రూ.2 రూపాయల వడ్డీకి అప్పు తెచ్చి ఆ కంపెనీలో డిపాజిట్ చేశాడు. సుమారు. రూ.13 లక్షలకు పైగా అతడు పెట్టుబడి పెట్టాడు. కొద్ది వారాలు అతడి ఖాతాకు వడ్డీ జమ చేసిన ఆ కంపెనీ బోర్డు తిప్పేసింది. యాప్ పనిచేయడం మానేసింది. దీంతో కంగారు పడ్డ ఆ చిరుద్యోగి తాను బయట చేసిన అప్పులకు వడ్డీలు చెల్లించేందుకు మళ్లీ అప్పులు చేశాడు. ఆ ఊబిలోంచి ఎలా బయటకు రావాలో అర్థం కాలేదు. ఈ నెల 2వ తేదీ ఉదయం అతడి సెల్‌ఫోన్ కి ఓ అపరిచిత వ్యక్తి ఫోన్ చేసి హిందీలో హడావుడిగా మాట్లాడాడు. నువ్వు మా యాప్ ద్వారా డబ్బులు తీసుకున్నావు. అత్యవసరంగా రూ.5వేలు చెల్లించు. అలా ఏడు దఫాలు చెల్లించాలి. లేకపోతే నీకు సంబంధించిన ఫోన్ నంబర్లు అన్నీ మా వద్ద ఉన్నాయి. వారికి ఫోన్ చేసి విషయం చెపుతామని బెదిరించాడు. ప్రతీ గంటకు ఫోన్ చేసి డబ్బులు పంపమని ఒత్తిడి చేశాడు. అసలే ఇబ్బందుల్లో ఉన్న అతడికి ఏం చేయాలో తోచలేదు. మధ్యాహ్నం ఆ అపరిచిత వ్యక్తి ఫోన్ నుంచి చిరుద్యోగి వాట్సాప్ కు ఓ ఫోటో వచ్చింది. నగ్నంగా అశ్లీల భంగిమలో ఉన్న ఆ ఫొటోకు ఇతడి ముఖం తగిలించి ఉండటంతో కంగారు పడ్డాడు. మరోసారి ఆ అజ్ఞాత వ్యక్తి ఫోన్ చేసి డబ్బులు వెంటనే పంపు.. లేకపోతే ఈ ఫొటో నీ కాంటాక్టు నంబర్లు అన్నింటికీ పంపుతాను. అయినా వినకపోతే నీ భార్య కుమార్తె ఫొటోలు కూడా పంపుతానని బెదిరించడంతో ఆ చిరుద్యోగికి చెమటలు పట్టాయి. కూలబడిపోయాడు. ఈ లోగా అతడి స్నేహితులు ఫోన్ చేసి నీ ముఖంతో కూడిన నగ్నఫొటో మాకు వచ్చిందని చెప్పడంతో మరింత కుంగిపోయాడు. తనను చుట్టుముట్టిన సమస్యల నుంచి బయట పడాలంటే చావు ఒకటే మార్గమని భావించాడు. భార్యా పిల్లలతో చనిపోవడానికి సిద్ధమయ్యాడు.

వేగంగా స్పందించిన ఎస్పీ

చిరుద్యోగి పరిస్థితి గమనించిన అతడి బంధువు రాత్రి 8 గంటలకు ఎస్పీ జగదీష్‌కి ఫోన్ చేసి విషయం చెప్పాడు. అతడు కుటుంబంతో చనిపోవడానికి సిద్ధంగా ఉన్నాడని ఎస్పీకి వివరించడంతో ఆయన వేగంగా స్పందించారు. బాధితుడితో ఫోన్లో మాట్లాడారు. తానున్నానని భయపడవద్దని చెప్పారు. సైబర్ క్రైం ఎస్సై అయ్యప్పరెడ్డికి, మూడో పట్టణ ఇన్‌స్పెక్టర్ వీరయ్యగౌడ్‌కు ఆయనే స్వయంగా ఫోన్ చేసి అప్రమత్తం చేశారు. సీఐ వీరయ్యగౌడ్ వెంటనే బాధితుల వద్దకు వెళ్లి ఆ కుటుంబానికి తానున్నానని ధైర్యం చెప్పి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆత్మహత్య చేసుకోవాలన్న తలంపు నుంచి బయటకు తీసుకువచ్చారు. అతడిని స్టేషన్ వద్దకు తీసుకువెళ్లి వివరాలు నమోదు చేసుకున్నారు. దీనిపై దర్యాప్తు చేసి న్యాయం చేస్తామని అతడికి భరోసా ఇచ్చారు. అతడికి జరిగిన మోసంపై దర్యాప్తు మొదలు పెట్టారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



ఘటనా స్థలిలో బాబూరావు మృతదేహం

ఏలేశ్వరం: మండల పరిధిలోని యర్రవరం సమీపంలోని జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. మండలంలోని సి.రాయవరం గ్రామానికి చెందిన పలివెల బాబూరావు(60) ప్రత్తిపాడు మండలం ధర్మవరం వెళ్లి తిరిగి వస్తుండగా యర్రవరం సమీపంలో విశాఖ నుంచి రాజమహేంద్రవరం వైపు వెళుతున్న కారు వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో మృతుడు బాబూరావు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి నలుగురు కుమార్తెలు ఉండగా వాళ్లందరికీ వివాహాలు జరిగాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అత్తమామలే కుమార్తెను హత్య చేశారని ఫిర్యాదు

రామచంద్రపురం రూరల్: తమ కుమార్తెను ఆమె అత్తమామలు హత్య చేశారంటూ మండలంలోని తాళ్లపొలంకు చెందిన పంపన అనంత లక్ష్మి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ద్రాక్షారామ ఎస్సై జి.సురేంద్ర ఆదివారం విలేకరులకు తెలిపారు. అనంత లక్ష్మి రెండవ కుమార్తె లక్ష్మి(27)కి ఆరు సంవత్సరాల క్రితం వెల్ల గ్రామానికి చెందిన అటికెల వెంకటేశ్వరరావుతో ప్రేమ వివాహం జరిగింది. అప్పటి నుంచి ఆమెను అత్తమామలు, బావ కలసి వరకట్నం తీసుకుని రావాలని, తమ కులం కాదని తరచుగా వేధించేవారని లక్ష్మి తన ఫిర్యాదులో తెలిపారు. ఈ నెల ఒకటో తేదీన రాత్రి తమ కుమార్తె అస్వస్థతకు గురైందని, ఉదయానికి చనిపోయిందని పేర్కొన్నారు. ఆదివారం పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. కేసును రామచంద్రపురం డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్ విచారణ చేపట్టారని ఎస్సై తెలిపారు.